విజయవాడ వరద బాధితులకు తోడ్పాటునివ్వాలి

విశాలాంధ్ర - విశాఖ: విజయవాడ వరదల్లో చిక్కుకున్న ప్రజానీకానికి ఆర్థిక సహాయం అందించి తోడ్పాటు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాయంత్రం పార్టీ ఆధ్వర్యంలో మధురవాడలో షాపుల యజమానులు, చిరు వ్యాపారులు, ప్రజల దగ్గరకు వెళ్లి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ విజయవాడ ప్రజలపై ప్రకృతి విరుచుకుపడిందని, వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకొని సహాయ సహకారాలు చేస్తున్నదని, మనం కూడా విజ్ఞత గల మాన వులుగా చేతనైనంత ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని అన్నారు. సీపీఐ నుండి ఇప్పటికే లక్ష రూపాయలు విరాళాలు సేకరించి రాష్ట్ర పార్టీ ద్వారా పంపామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మధురవాడ ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ, ఎండి బేగం, బంగారయ్య, త్రినాథ్, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

నిబద్ధత గల మార్క్సిస్టు సీతారాం ఏచూరి

విశాలాంధ్ర - విశాఖ: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నిబద్ధత గల మార్క్సిస్టు మేధావి అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జె అత్యుతరావులు కొనియాడారు. జగదాంబ సీఐటీయూ జిల్లా కార్యాలయానికి శుక్రవారం సీపీఐ, ఏఐటీయూసీ నాయకుల ప్రతినిధి బృందం వెళ్లి కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. సీపీఎం జిల్లా సీనియర్ నాయకులు వై.రాజు, జి.పోలేశ్వరరావు, ఎం.ప్రదీప్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావులను కలిసి పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జె అచ్యుతరావులు మాట్లాడుతూ ఏచూరి మరణం దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకే కాదు.. దేశ రాజకీయాలకూ తీరని లోటు అన్నారు.

సీపీఐ, ఏఐటీయూసీ నాయకుల నివాళి

విద్యార్థి దశ నుంచే వామపక్ష భావాలను అలవరచుకున్న కామ్రేడ్ ఏచూరి తుదిశ్వాస విడిచే వరకు ప్రజా పోరాటాల్లో జీవించారని, చివరకు తన దేహాన్ని సైతం ప్రజాసేవకే అంకితం చేసిన కమ్యూనిస్టు అని అన్నారు. మరణించిన తర్వాత కూడా ఆయన పార్థివ దేహాన్ని వైద్య విద్యార్థుల బోధన, పరిశోధనల కోసం దానం చేస్తున్నట్లు ఏచూరి కుటుంబీకులు ప్రకటించడం గొప్ప విషయమన్నారు. కామ్రేడ్ ఏచూరికి నివాళులర్పించిన వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, సిఎన్ క్షేత్రపాల్, ఏఐటీయూసీ నాయకులు ఎం.మన్మథ రావు, సీపీఎం నాయకులు కె.వి.పి.చంద్రమౌళి, ఎం.సూరీడు, కె.సత్యనారారణ, జక్కాన సత్యనారాయణ, పోర్టు డిఎల్‌బి యూనియన్ నాయకులు లక్ష్మణరావు, ఈశ్వరరావు తదితరులున్నారు.

అప్పన్న నిత్యాన్న ప్రసాదానికి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నప్రసాద పథకానికి విశాఖలోని ఇసుక తోటకు చెందిన ఆకెళ్ళ జవహర్ లాల్ నెహ్రూ దంపతులు రూ.1,00,000/-లు విరాళంగా సహాయ కార్యనిర్వహణాధికారి పిల్లా శ్రీనివాసరావు, గుమాస్తా సూర్యనారాయణలకు అందజేశారు. ఆలయ మర్యాదల ప్రకారం దాతకు స్వామివారి ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వ చనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారికి భక్తులు, దాతలు ఏమైనా వస్తువులు, ధన, చెక్కు, డిడి రూపేణా విరాళం ఇచ్చినా సంబంధిత అధికారి వద్ద తగు రసీదు పొందాలని లేదంటే వారు ఇచ్చిన విరాళాలు స్వామివారికి చెందవని అధికారులు తెలిపారు. దాతలకు ఎటువంటి సమాచారం కావాలన్న 9491000635 నెంబర్ కు సంప్రదించాలని ఈఓ ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు.

సీఎం సహాయ నిధికి విశాఖ పోర్టు రూ.కోటి విరాళం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విజయవాడలో వరద ప్రభావిత ప్రాంత ప్రజల సహాయార్థం విశాఖపట్నం పోర్టు అథారిటీ రూ.కోటి (ఒక కోటి రూపాయలు) విరాళం ఇచ్చింది. పోర్ట్ కార్యదర్శి టి.వేణు గోపాల్, వివిధ విభాగాధిపతులు కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌కు చెక్కును అందజేశారు. సమాజానికి అవసరమైనపుడు సహాయ సహకారాలు అందించడంలో విశాఖ పోర్ట్ యాజమాన్యం, సిబ్బంది ఎప్పుడు ముందు వరుసలో ఉంటారు. విజయవాడ వరదలకు సంబంధించి సెప్టెంబర్ 9 న పోర్ట్ కార్మిక సంఘాలు మరియు అధికారుల సంఘాలతో చర్చించి, వరద బాధితుల కోసం ఒక రోజు వేతనాన్ని సీఎం సహాయ నిధికి అందించాలని నిర్ణయించారు. కార్మిక సంఘాలు ఒక రోజు బేసిక్ వేతనాన్ని విరాళంగా ఇవ్వడానికి అంగీకరించగా, అధికారుల సంఘం ఒక రోజు బేసిక్ వేతనం మరియు ఒక రోజు డీఏ ఇవ్వడానికి అంగీ కరించింది. రూ.45,81,770/- లను సిబ్బంది, అధికారుల నుంచి, రూ.54,18,230/-లను సిఎస్ఆర్ నిధి నుంచి వెరసి మొత్తం రూ.1.00 కోటి రూపాయలు సీఎం సహాయనిధికి అందించేందుకు పోర్ట్ చైర్మన్ డా.ఎం.అంగముత్తు ఆమోదం తెలిపారు. వరద బాధితులను సహాయం చేయడానికి స్టేక్ హోల్డర్లు, స్టీవిడోర్ సంఘాలను ఉదారంగా విరాళాలు ఇవ్వాలని చైర్మన్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

అవంతి కళాశాలలో వన మహోత్సవం

విశాలాంధ్ర - భీమిలి: తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా చిప్పాడ గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ నందు మొక్కలు నాటించడం జరిగింది. సుమారుగా 150 మొక్కలు వరకు నాటారు. ఈ కార్య క్రమంలో ప్రిన్సిపాల్ డా. బి.మురళీ కృష్ణ, డా. షరీఫ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఆర్ఐటిలో వనం-మనం

విశాలాంధ్ర - అనందపురం: మండలంలో శొంఠ్యాం పరిధిలో ఉన్న నడింపల్లి సత్యనారాయణ రాజు ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం చేపట్టారు. 15 రోజులపాటు నిర్వహించే కార్యక్రమంలో సుమారుగా 500 వరకు మొక్కలు నాటడం జరిగిందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పర్యావరణానికి మొక్కల యొక్క ప్రాముఖ్యత వాటిపై అవగాహన, ప్రిన్సిపాల్ కల్పించారు. అలాగే ఈ అంశంపై వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శంభు ప్రసాద్, పీఓ హరగోపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు వి.డి.డిల్లేశ్వరరావు, ఉపాధ్యాయుల విద్యార్థులు పాల్గొన్నారు.

హోమియో ఆసుపత్రికి శంకుస్థాపన

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 93వ వార్డులో పలు అభివృద్ధి పనులకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు శుక్రవారం ఉదయం శంకుస్థాపన చేశారు. స్థానిక కార్పొరేటర్ రాపర్తి కన్నా ఆధ్వర్యంలో సాయిమాధవ్ నగర్‌లో 31.55 లక్షలతో హోమియో ఆసుపత్రి పునర్నిర్మాణం, కృష్ణానగర్‌లో 11.14 లక్షలతో సిసి రోడ్లు, కాలువల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం కోటి నాలుగు లక్షల బ్యాంకు రుణాలను 14 మహిళా సంఘాలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా శిథిల దశలో కొట్టుమిట్టాడుతున్న హోమియో ఆసుపత్రికి కార్పొరేటర్ రాపర్తి కన్నా చొరవతో పూర్వవైభవం వస్తోందని, ఆసుపత్రికి అదనపు అంతస్తు భవనం మంజూరు చేయించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. నాలుగు రోజుల్లో పనులు ప్రారంభించి ఈ ప్రాంత ప్రజలకు హోమియో వైద్య సేవలు త్వరగా అందేలా కృషి చేస్తామని తెలిపారు. అలాగే గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడానికి కార్పొరేటర్ రాపర్తి కన్నా, తాను కలిసి జీవీఎంసీ కమిషనర్‌ను కలిసామని త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రామునాయుడు, 69వ వార్డు మాజీ కార్పొరేటర్ రాపర్తి శైలజ, జోన్-8 కమిషనర్ హైమావతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రత్నాకర్ రెడ్డి, డి.ఇ. విజయ్ కుమార్, ఏఈ కుసుమ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతుల రుణాలు రీషెడ్యూల్ చేయాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు రుణాలను రీషెడ్యూల్ చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ వివిధ బ్యాంకుల అధికారులను ఆదేశించారు. తక్కువ వడ్డీకే రుణాలను మంజూరు చేయాలని కోరారు. ఈ నెల 8, 9వ తేదీలలో జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన రైతులకు రుణాల రీషెడ్యూల్, కొత్త రుణాల మంజూరుపై ప్రత్యేక జిల్లా సలహాదారు కమిటీ సమావేశం (స్పెషల్ డిసిసి) జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కురిసిన భారీ వర్షాల వలన పద్మనాభం, పెందుర్తి మండలాల్లో గల 31మంది రైతులకు చెందిన 7.84 హెక్టర్ల వ్యవసాయ పంటలు దెబ్బతిన్నట్లు జిల్లా వ్యవసాయా ధికారి చెప్పారని అన్నారు. ఆ రైతులందరికీ వ్యవసాయ రుణాలు ఉన్నదీ, లేనిదీ పరిశీలించి రుణాలను రీ షెడ్యూల్ చేయాలని, లేని వారికి కొత్త రుణాలను మంజూరు చేయాలని పేర్కొన్నారు. కాకాని నగర్, కె.నగరంపాలెం ప్రాంతాల్లో మరణించిన పశువుల స్థానంలో కొత్త పశువులు కొనుగోలు చేసుకునేలా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే నష్టపోయిన మత్స్యకారులకు కూడా రుణాలను మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని కలెక్టర్ తెలిపారు. తక్కువ వడ్డీకే రుణాలను మంజూరు చేయాలని బ్యాంకు అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, ఆర్బిఐ సూచనల మేరకు ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జరిగిన నష్టాలను అంచనా వేసి ఆర్థికంగా ఆదుకునేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, డీఆర్డీఏ పీడీ ఎంఎస్.శోభారాణి, జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, మత్స్య శాఖ జేడీ జి.విజయ, పశుసంవర్ధక శాఖ జేడీ డా. డి. రామకృష్ణ, వివిధ బ్యాంకుల మేనేజర్లు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఔషధ ప్రయోగాలు జంతువులకు ప్రత్యామ్నాయం

విశాలాంధ్ర - మధురవాడ: మానవాళి ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక వ్యాధులకు ఔషధాలను కనుగొనడం ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్నదని ముఖ్యంగా పరిశోధించిన ఔషధాలను జంతువులపై ప్రయోగించి ఫలితాలను చూడడానికి నైతిక అంశాలకు తోడు చట్టాలను అనుసరించాల్సి ఉందని దీనికి అధిక సమయం పడు తోందని ఈ కారణంగా జంతువులపై ప్రయోగాలకు ప్రత్యామ్నా యాన్ని గుర్తించడం అవసరమని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన వర్క్‌షాప్‌లో నిపుణులు సూచించారు. కార్యక్రమాన్ని ప్రారం భించిన వ్యాస్ కేన్సర్ రీసెర్చి పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ డైరక్టర్ మరియు సీఫ్ ఎక్సిక్యుటివ్ ఆఫీసర్ డాక్టర్ మందర్ కులకర్ణి మాట్లాడుతూ కృత్రిమ మేధ, కంప్యూటర్ టెక్నాలజీలు అందుబాటులోకి వస్తున్న ప్రస్తుత కాలంలో ఔషధ పరిశోధనలకు జంతువులను ఉపయోగించడం కంటే ఇతర మార్గాలపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ జంతువులపై ప్రయోగాలకు ప్రస్తుత కాలంలో సామాజిక వ్యతిరేకత ఉందని ఈ దృష్ట్యా నైతిక విలువలను పాటిస్తూ శాస్త్ర పరిశోధనలు జరగాలి అన్నారు. జిమ్‌సర్ ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ ఔషధ ప్రయోగాలకు జంతువులకు ప్రత్యామ్నాయం లేదని, పరిశోధన ఫలితాలకు జంతువులను వాడే సమయంలో విధిగా నిబంధనలను పాటించాలని, నైపుణ్యాలతో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో భారత ప్రభుత్వ పశు సంవర్ధక శాఖ సీనియర్ నిపుణులు డాక్టర్ వివేక్ త్యాగి, గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్‌దాస్, గీతం ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రాజా, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ జి.సుహాసిన్, శాస్త్ర వేత్తలు డాక్టర్ ఎన్.హరిశంకర్, డాక్టర్ ఎమ్.జె.మహేష్‌కుమార్, డాక్టర్ ప్రాంజలి మిలింద్ పోర్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో దీక్షారంభం

విశాలాంధ్ర - భీమిలి: స్థానిక ఎస్‌విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు దీక్షారంభం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ అధ్యాపకులను పరిచయం చేసి కళాశాలలో ఉన్న వసతులను విద్యార్థులంతా వినియోగించుకోవాలని, కళాశాలలో అత్యుత్తమ అధ్యాపకుల చేత బోధన కొనసాగుతుందని, విద్యార్థులు వీటిని వినియోగించుకొని క్రమశిక్షణతో ఉంటూ విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ విష్ణుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని నైపుణ్యాలను పెంపొందించుకొని ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్యుఏసీ కోఆర్డినేటర్ బి.ప్రసాద్‌రావు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.సహదేవుడు, జేకేసీ కోఆర్డినేటర్ డి.మాధురి, ఇంటెన్ షిప్ కోఆర్డినేటర్ వై.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్స్ డాక్టర్ డి.ప్రవీణ, శ్రీను పాల్గొన్నారు.

ఆనందపురం సీఐగా వాసునాయుడు బాధ్యతలు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా చింత వాసునాయుడు శుక్రవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈయన ఎన్‌డిపిఎస్, త్రీ టౌన్, భీమిలి పోలీస్ స్టేషన్లో టాస్క్ ఫోర్స్ విభాగాల నందు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా, తర్వాత ప్రమోషన్‌లో శ్రీకాకుళం నందు సిఐగా కొంతకాలం పనిచేసి ఇటీవల అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఎన్‌డిపిఎస్ టాస్క్ ఫోర్స్ విభాగాల్లో విధులు నిర్వహించి ఇటీవలే బదిలీల్లో భాగంగా విశాఖ పోలీస్ కమిషనర్ ఆదేశాలతో ఆనందపురం సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పిఎస్ పరిధిలో ఎటువంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలు, ట్రాఫిక్, క్రైమ్ రేటును తగ్గించడంలో తమ వంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఇక్కడ విధులు నిర్వహించిన సిఐ తిరుపతిరావును విశాఖ రేంజ్ విఆర్‌కి సిపి అటాచ్ చేశారు. ఈ సందర్భంగా ఆనందపురం సబ్ ఇన్‌స్పెక్టర్లు గంట్యాడ సంతోష్, పందిరి శివ, స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్.ఎం.పి వైద్యులకు ధ్రువపత్రాల పంపిణీ

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలోని ఆర్‌ఎంపి వైద్యులకు ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ద్వారా ఆర్‌ఎంపీ వైద్యంలో అర్హులైన, నైపుణ్యం కలిగిన గ్రామీణ వైద్యులకు ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంక్షేమ ఫెడరేషన్ ద్వారా ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం ఫెడరేషన్ అధ్యక్షుడు జంగం జోషి, మహిళా అధ్యక్షురాలు సుగుణేశ్వరి ఆదేశాల మేరకు జిల్లా సెక్రెటరీ, మండల ఇన్చార్జ్ జిబి రాజు చేతుల మీదుగా గ్రామీణ వైద్య మిత్రులకు ధ్రువ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ఆర్.ఎం.పి వైద్య విధానంలో సేవల ద్వారా ప్రజలకు మరింత చేరువై వారి ఆరోగ్యాన్ని ఎల్లవేళలా కాపాడుతూ మన ఫెడరేషన్‌కు మంచి పేరు తీసుకొస్తారని ఆశిస్తున్నామని తెలియజేశారు.

ఏఎన్ఎంలను వేధిస్తున్న మేల్ నర్స్ కోటేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలి

ఉన్నతాధికారులకు ఏపీ ఏఎన్ఎం అసోసియేషన్ ఫిర్యాదు

విశాలాంధ్ర - విశాఖపట్నం: గత రెండున్నర ఏళ్లుగా ఏఎన్ఎంలుగా పనిచేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు జిఎన్ఎమ్ ట్రైనింగ్‌కి శిక్షణ పొందుతూ ఉన్న తమపై జి.కోటేశ్వరరావు అనే నర్స్ అనేక విధాలుగా వేధింపులకు పాల్పడుతున్నాడని ఏపీ ఏఎన్ఎం, హెచ్ఎస్, పీహెచ్ఎన్, సిహెచ్వో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటలక్ష్మి ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం వైద్యారోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి, డిఎంఈకి నర్స్ కోటేశ్వరావుపై ఫిర్యాదు చేస్తూ లెటర్ రాశారు. దీంతోపాటు ఇదే అంశంపై కేజీహెచ్ సూపరింటెండెంట్‌కి కూడా ఫిర్యాదు చేస్తూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమను స్టాఫ్ నర్సులుగా వినియోగించుకునేందుకు జీఓ నెంబర్ 115 విడుదల చేసినప్పటి నుంచి తమ ఏఎన్ఎంలపై, ప్రభుత్వంపై సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో కూడా చాలా నీచంగా తమను వేధించినప్పటికీ సంయమనం పాటించామని, వేధింపులు ఎక్కువ కావడంతో ఫిర్యాదు చేస్తున్నామన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో ఏఎన్ఎంల కష్టాలు గుర్తించి వారి నైపుణ్యాన్ని వెలికి తీసి వారికి స్టాఫ్ నర్స్ సేవలు చేసే అవకాశం కల్పించిన ప్రభుత్వానికి తాము రుణపడి ఉంటామన్నారు. జీవో నెంబర్ 115 వచ్చినప్పటి నుంచి కొంతమంది కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని, తమను ప్రతి హాస్పిటల్‌లో తీవ్రంగా దూషిస్తూ అసభ్య పదజాలంతో వేధిస్తున్నట్టు చెప్పారు. మరీ ముఖ్యంగా ఇద్దరు నర్సులు నుంచి తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తపరిచారు. విశాఖలోని కేజీహెచ్‌నందు మేల్ నర్స్‌గా పని చేస్తున్న కోటేశ్వరరావు, గుంటూరు జిజిహెచ్‌లో పనిచేస్తున్న స్వచ్ఛానంద ప్రసాద్ అనే వీరిద్దరూ స్ట్రగల్ కమిటీ అని పెట్టి రాష్ట్ర వ్యాప్తంగా అందరిని రెచ్చగొడుతూ డ్యూటీ చేయకుండా రోజంతా రోడ్ల మీద నిరసనలు చేయమని బలవంత పెడుతున్నారని చెప్పారు. అందరి కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను ప్రభుత్వంపై రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చాలా ఆసుపత్రిలో ఈ మేల్ నర్సులు ఇద్దరూ పెత్తనం చేస్తూ స్టాఫ్ నర్సులను ఎవర్ని పనిచేయకుండా, రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందకుండా అడ్డుపడుతున్నారని చెప్పారు. అడ్డుగోలుగా నర్సింగ్ సేవలో స్థానం సంపాదించి జీవో నెంబర్ 47 ద్వారా వీరు ఉద్యోగాలు పొందారని అన్నారు

అక్రమ వసూళ్లకు తెర:

స్ట్రగుల్ కమిటీ పేరుతో మేల్ నర్సులైన కోటేశ్వరరావు, స్వచ్ఛానంద ప్రసాద్ రాష్ట్రవ్యాప్తంగా చాలామంది స్టాఫ్ నర్సుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నిరసనల పేరుతో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు ఒక్కొక్కరి దగ్గర కొంత మొత్తం వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

మహారాజశ్రీ 12వ అదనపు జిల్లా జడ్జి, (యఫ్‌టీసి) విజయవాడ.
యం.వి.ఓ.పి. నెం.308 / 2022
పిటీషన్ :
మట్టా సుబ్బలక్ష్మీ, భర్త (లేటు) వెంకట కృష్ణ రావు, హిందు, ఫిమేల్, వయస్సు 32 సం.ములు, ఇంటి నెం. 2-325, ముచ్చినపల్లె గ్రామం, రెడ్డిగూడెం మండలం, యన్.టి.ఆర్.జిల్లా. (కృష్ణ జిల్లా.) అండ్ 3 అదర్స్. **- పిటీషనర్స్**
మరియు
జె. ప్రభాకర్, సన్ ఆఫ్ గౌరి శంకరరావు, హిందు, మేల్, వయస్సు 54 సం.ములు, డ్రైవర్ కమ్ ఓనర్ ఆఫ్ కార్ బేరింగ్ నెం.ఎపి 31 బిజె 0366, అడ్రస్ 6-22-3/5, ఫ్లాట్ నెం. 101, ఈస్ట్ పాయింట్ కాలనీ, విశాఖపట్నం, విశాఖపట్నం జిల్లా.
- రెస్పాండెంట్ నెం.1 మరియు డ్రైవర్ కమ్ ఓనర్
పై నెంబరు గల **యం.వి.ఓ.పి. నెం. 308 / 2022 లో** మీరు అనగా **జె. ప్రభాకర్, రెస్పాండెంట్ నెం.1** మరియు డ్రైవర్ కమ్ ఓనర్ అయివున్నారు. మీకు కోర్టువారు ఎన్నిమార్లు నోటీసులు పంపినా మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున **ది. 15.10.2024వ తేదిన** మీరు గానీ, లేక మీ లాయర్ గారి ద్వారా గాని **ఉదయం 10.30 గంటలకు** కోర్టువారి ఎదుట హాజరు అయి మీ సంజాయిషీ తెలుపుకొనగలరు. లేని ఎడల మీ పరోక్షంలో పై నెంబరు గల **ఎం.వి.ఓ.పి. నెం.308/ 2022** తీర్మానించబడును.
యస్. రఘురామ్, వి.వి. నరసింహారావు మరియు కంతేటి నవీన్ కుమార్
అడ్వకేట్స్, విజయవాడ.
సెల్: 8520811119, 9885448343

ఆదర్శ్ మెగా జాబ్ మేళాలో 56 మందికి ఉద్యోగాలు

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 56 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని కాలేజీ ప్రిన్సిపాల్ ఎన్ఇ ఫ్లోరా తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో ఎం.ఎస్ స్కేర్ టెక్నాలజీస్ కంపెనీ మేనేజర్స్ పి.సాయి సంతోష్, పి.మణికంత, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సి. హెచ్.తరుణ్, హెచ్-ఆర్ ఎస్.జ్యోత్స్న, ఎ.నవ్య పాల్గొన్నారు. ఆదర్శ్ డిగ్రీ కాలేజీలో ప్రతి నెల జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, ఇటువంటి అవకాశాన్ని యువత ఉపయోగించుకోవాలని కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాస్‌రావు నిరుద్యోగులకు సూచించారు. ఆదర్శ్ డిగ్రీ కాలేజీలో ప్రస్తుతం 3 సంవత్సరం 5వ సెమిస్టర్ చదువుతున్న 50 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని, డిసెంబర్ 1 నుండి 25 వేల ప్రాథమిక జీతంతో ఉద్యోగంలో చేరి, మరొక మూడు నెలల తర్వాత నుండి 4 లక్షల నుండి 8 లక్షల వార్షిక జీతం పొందుతారని కాలేజ్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.థియోఫిలస్ తెలియజేసారు. ఈ మేళాలో ఏఓ రవి బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఏడికే రాజు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ ఆఫీసర్ జి.కమలరాణి, మెంబర్స్ కెఎస్ఆర్ రాజేష్‌రావు, ఎం.వి.నాగమణి, డి.సింహాచలం, డి.భవాని, ఎస్.కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాలను సందర్శించిన వ్యవసాయ శాఖ అధికారులు

విశాలాంధ్ర - భీమిలి: ప్రస్తుతం తుఫాన్ తరువాత ఆకుముడత /తెల్ల చిత్త /నాము /నాము తెగులు ఆశించే పరిస్థితులు ఎక్కువ ఉన్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు వరి పొలాలను సందర్శించారు. ఇప్పటివరకు సుమారు 1245 ఎకరాలలో వరి పంట విస్తీర్ణం నమోదు కాగా ఇప్పటికే మండలంలో కొన్ని పొలాల్లో ఈ పురుగు ఆశించి ఉంది. అధిక వర్షాల వల్ల పొలం లో నిలిచిన నీరు తీసిన వెంటనే ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పోటాష్ చల్లుకోవాలని అధికారులు సూచించారు. పంట వేసే ప్రతీ రైతు కూడా సచివాలయం సిబ్బందిని సంప్రదించి తక్షణమే ఆన్లైన్‌లో పంట నమోదు చేయించుకోవాలి అని తెలియజేశారు.

పెద్ద మనసు చాటుకున్న చిన్నారులు

విశాలాంధ్ర - ఆనందపురం: ఇటీవల విజయవాడలో వరదలు రావడంతో విజయవాడ వాసులు కష్టాలను ఎదుర్కొంటూ జీవనం కూడా ఎంతో ఇబ్బందిగా ఉన్న ఈ పరిస్థితుల్లో వందలాదిమంది వ్యాపారస్తులు, ప్రజలు తమ వంతుగా సహాయ సహకారాలను అందిస్తున్నారు. ఇందులో భాగంగా ఆనందపురం మండలం

నీలకుండీలలో గల శ్రీ సాయి స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థులు సేవా గుణాన్ని చాటుకుంటూ తాము దాచుకున్న సుమారుగా 22 వేలు నగదను వరద బాధితులకు అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర హెంశాఖ మంత్రి వంగలపూడి అనిత వారిని అభినందిస్తూ, చిన్నతనంలో ఇలాంటి కార్యక్రమాలు చేయడం వలన పెద్దయ్యాక విద్యార్థులలో సేవా దృక్పథం ఏర్పడుతుందని ప్రశంసించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ లెంక సురేష్ మాట్లాడుతూ సేకరించిన డబ్బులను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేయనున్నట్లు తెలిపారు.

సూపర్ స్టార్'ను ఆవిష్కరించిన స్టార్ హెల్త్, పాలసీబజార్

విశాలాంధ్ర -విశాఖపట్నం: కస్టమర్లకు మరింత విలువ చేకూర్చే లక్ష్యంతో, వారి ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా, వ్యక్తిగతీకరించిన దీర్ఘకాలిక ఆరోగ్య బీమా పథకం 'సూపర్ స్టార్'ను స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్) మరియు పాలసీ బజార్ ఆవిష్కరించాయి. పాలసీదారుల మారుతున్న అవసరాలకు అనుగుణంగా ఈ గేమ్ చేంజర్ ప్రోడక్టు రూపొందించబడింది. ఇది అసమానమైన ఫ్లెక్సిబిలిటీ మరియు కస్టమైజేషన్‌ను అందిస్తుంది. వ్యక్తులకు, కుటుంబాలకు 5 ఏళ్ల దీర్ఘకాలానికి ఇది లభిస్తుంది. జీవితంలోని వివిధ దశల్లో కస్టమర్ల అవసరాలకు తగ్గట్లుగా మారే విధంగా మాడ్యూలర్ కవరేజ్‌ను అందించడం ద్వారా ఆరోగ్య బీమా విభాగంలో సూపర్ స్టార్ ఇన్సూరెన్స్ ప్లాన్ కొత్త మార్పులకు నాంది పలుకుతుంది. పూర్తిగా డిజిటల్ ప్రోడక్ట్ అయిన సూపర్‌స్టార్ పథకాన్ని పాలసీబజార్ వెబ్‌సైట్ మరియు స్టార్ హెల్త్‌కి చెందిన పోర్టల్‌లో ఇక్కడకొనుగోలు చేయొచ్చు.

సాంసంగ్ గెలాక్సీ ఎస్ 24 అల్ట్రాపై పరిమిత కాల ఆఫర్ ప్రకటన

విశాలాంధ - విశాఖపట్నం: భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, ఈరోజు తమ ఫ్లాగ్‌షిప్ గెలాక్సీ ఎస్ 24 అల్ట్రా స్మార్ట్‌ఫోన్‌పై ఎన్నడూ చూడని ధరను ప్రకటించింది. సెప్టెంబర్ 12, 2024 నుండి, గెలాక్సీ ఎస్ 24 అల్ట్రా పరిమిత వ్యవధి ఆఫర్‌లో భాగంగా కేవలం రూ.109999కి అందుబాటులో ఉంటుంది. ఈ స్మార్ట్‌ఫోన్ అసలు ధర రూ.129999. ప్రత్యేక ధరలో రూ.8000 ఇన్‌స్టంట్ క్యాష్ బ్యాక్‌తో పాటు రూ.12000 అదనపు అప్‌గ్రేడ్ బోనస్ కూడా ఉంటుంది. ప్రత్యామ్నాయంగా, వినియోగదారులు రూ.12000 బ్యాంక్ క్యాష్‌బ్యాక్‌ను కూడా పొందవచ్చు. అదనంగా, వినియోగదారులు 24 నెలల పాటు నో-కాస్ట్ ఈఎంఐ ప్రయోజనం సైతం పొందవచ్చు. గెలాక్సీ ఎస్ 24 అల్ట్రా మొబైల్, ఏఐ యొక్క కొత్త శకానికి నాంది పలికింది, వినియోగదారులు గెలాక్సీ ఏఐ తో మరిన్ని పనులు చేయగలుగుతారు.

'ఫెస్టివల్ ఆఫ్ కార్స్'ను జరుపుకుంటున్న టాటా ఈవీ

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశపు ఎలక్ట్రిక్ మొబిలిటీ విప్లవానికి మార్గదర్శకు టాటా ఈవీ తన'ఫెస్టివల్ ఆఫ్ కార్స్ వేడుకల్లో భాగంగా తన బెస్ట్ సెల్లింగ్ మోడల్స్ టియోగో ఈ వీ, పంచ్ డాట్ ఇవి, నెక్సన్ డాట్ ఇవి లపై మునుపెన్నడూ లేని అత్యంత సరసమైన ధరలను ప్రకటించింది. ఇవీ లను సగటు వినియోగదారులకు మరింత సరసమైనదిగా మార్చే ప్రయత్నంలో ఈవీల ధరలు నెక్సాన్ డాట్ ఈవీ కోసం రూ.3 లక్షల వరకు మరియు పంచ్ డాట్ ఈవీ కోసం రూ. 1.20 లక్షల వరకు తగ్గించబడ్డాయి. టాటా డాట్ ఈవీ స్థానికీకరణ సాంకేతికత మెరుగుదలల ప్రయోజనాలను వినియోగదారులకు అందజేస్తోంది మరియు గత నెలలో ప్రారంభించిన కర్వ్ డాట్ ఈవీకి అనుగుణంగా ఐసిఈ ధరలను కూడా తీసుకురాగలిగింది. ఈ ప్రత్యేక ఆఫర్‌తో టాటా డాట్ ఇవి బెస్ట్ సెల్లింగ్ నెక్సన్ డాట్ ఈవి ధరలను ఐసీఈ మోడల్‌లతో సమానంగా పరిమిత సమయం వరకు తీసుకువస్తోంది.

యువసేన యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర - ఆనందపురం: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నవరాత్రుల్లో భాగంగా మండలంలో బంటుపల్లి వారి గ్రామపంచాయతీ కాలనీ పరిధిలో శుక్రవారం మహా అన్నదాన కార్యక్రమం యువసేన యూత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 1500 మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారని, ప్రతి సంవత్సరం స్వామివారి కార్యక్రమం చేయడం చాలా ఆనందదాయకమని ఉత్సవ కమిటీ యువసేన యూత్ తెలిపారు.

బాక్సింగ్ పోటీల్లో చిన్నారుల ప్రతిభ

విశాలాంధ్ర - భీమిలి: భారత్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన మూడవ ఇండో నేపాల్ బాక్సింగ్ ఇంటర్నేషనల్ చాంపియన్ షిప్ 2024 నేపాల్ యూత్ డెవలప్మెంట్ ఫోరం వాళ్లు నిర్వహించిన బాక్సింగ్ పోటీలలో చిట్టివలస డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఉన్నత పాఠశాల చిన్నారులు అద్భుత ప్రదర్శన కనబరిచి మెరిట్ సర్టిఫికెట్‌తో పాటు మెడల్ సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.జగన్నాథ స్వామి తెలియజేశారు. 8వ తరగతికి చెందిన లక్కోజు వికాస్, లక్కోజు వినోద్ ఇద్దరు విద్యార్థులు మంచి పోరాటపటిమ కనబరిచి అందరి ప్రశంసలను అందుకోవడమే కాకుండా పతకాలు సాధించారని పాఠశాల ఉపాధ్యాయులు జగదీష్, బలరామకృష్ణ, చిన్నమనాయుడు తదితర ఉపాధ్యాయులు అభినందిస్తూ సన్మానించారు. ఇదే స్ఫూర్తితో అంతర్జాతీయ, ప్రపంచ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ వరలక్ష్మి తెలియజేశారు.

ప్లాంట్‌ను రక్షించుకోవడమే ఏచూరికి నిజమైన నివాళి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవడమే సీతారాం ఏచూరికి నిజమైన నివాళి అని స్టీల్ అఖిల పక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు అన్నారు. స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లాంట్ స్టోర్ జంక్షన్ వద్ద కామ్రేడ్ సీతారాం ఏచూరి సంతాప సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సభకు స్టీల్ సీఐటీయూ అధ్యక్షులు వైటి దాస్ అధ్యక్షత వహించారు. ఈ సభలో స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, స్టీల్ ఏఐటీయూసీ అధ్యక్షులు కెఎస్ఎన్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమలపై అవగాహనతో కూడిన ప్రసంగాలను ప్రతి ఒక్కరికి అర్థమయ్యే విధంగా ప్రసంగించడం ఏచూరి ప్రత్యేకతని అన్నారు. సీతారాం ఏచూరి బహుముఖ ప్రజ్ఞాశాలి అని భారత రాష్ట్రపతి, ప్రధాన మంత్రితో సైతం నేడు కొనియాడుతున్నారని వారు అన్నారు. ఆయన మృతి తీరనిలోటని ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాల కోసం కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. స్టీల్ ప్లాంట్ ఉద్యమంలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొన్నారని, దీనిని రక్షించుకోవడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు పి.శ్రీనివాసరాజు, నీరుకొండ రామచంద్రరావు, జె.రామకృష్ణ, స్టీల్ అధికార సంఘం ప్రధాన



కార్యదర్శి కెవిడి ప్రసాద్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు భయ్యా మల్లయ్య, ఓబీసీ అధ్యక్షులు బి.అప్పారావు, దొమ్మేటి అప్పారావు, కొమ్మినేని శ్రీనివాస్, డివి రమణారెడ్డి, దాలి నాయుడు గుమ్మడి నరేంద్ర, జెర్రిపోతుల ముత్యాలు, శ్రీనివాస్ నాయుడు, రామ్ కుమార్, మహాలక్ష్మి నాయుడు, పికె రెడ్డి, అట్టా అప్పారావు, పరంధామయ్య, శరత్, కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ అధ్యక్షులు జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ-2024 కార్యక్రమాలను విజయవంతం చేయాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన స్వచ్ఛత హీ - 2024 కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతంగా చేపట్టాలని వివిధ విభాగాల అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. సంబంధిత షెడ్యూల్‌కు అనుగుణంగా జిల్లాలో 13వ తేదీలోగా కార్యాచరణ రూపొందించి అందరూ సంసిద్ధంగా ఉండాలని సూచించారు. 17వ తేదీ నుంచి జిల్లా స్థాయి కార్యక్రమాలు మొదలవుతాయని, అధికారులందరూ సన్నద్ధంగా ఉండాలని, క్రతువును విజయవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం కలెక్టరేట్ మీటింగు హాలులో వివిధ విభాగాల అధికారులతో కూడిన జిల్లా స్టీరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ వివరాలను వెల్లడించారు. కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం జిల్లాలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 02వ తేదీ నుంచి వివిధ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. స్వచ్ఛతా కి భాగిదారీ, సంపూర్ణ స్వచ్ఛత, సఫాయి మిత్ర సురక్ష షివిరిస్ అనే మూడు ప్రధాన పిల్లర్ల ఆధారంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. భాగిదారీలో భాగంగా ప్రజలను భాగస్వామ్యం చేయాలని, తల్లిపేరుతో ఒక మొక్కను నాటాలని, విద్యుత్ పొదుపు, నీటి ఆదా, ప్లాస్టిక్ నిరోధం, తాగు నీటి క్లోరినేషన్ ప్రక్రియ, ఆరోగ్యకరమైన జీవన విధానం తదితర అంశాలపై విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులకు చెప్పారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వాల్ పెయింట్స్ వేయాలన్నారు. ఏఏ అంగన్వాడీ కేంద్రాలు పరిశుభ్రంగా ఉండేలా చిన్నారులకు చేతులు శుభ్రం చేసుకోవటంపై చెప్పాలని సూచించారు. మనం - వనం మాదిరిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. విద్యార్థులు, ప్రజలను, ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ ర్యాలీలు, అవగాహన శిబిరాలు నిర్వహించాలని చెప్పారు. మూడో పిల్లర్ అయిన సఫాయిమిత్ర సురక్ష షివిరిస్‌లో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో భాగంగా స్వచ్ఛత హీ - 2024కు సంబంధించిన గోడపత్రికను కలెక్టర్, ఇతర అధికారుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ పోలీస్ కమిషనర్ ఫక్కీరప్ప, ఎస్.డి.సి. సీతారామ మూర్తి, జీవీఎంసీ ఏడీసీ రమణమూర్తి, జడ్పీ సీఈవో సత్యనారాయణ, డీపీవో శ్రీనివాసరావు, సీపీవో శ్రీనివాసరావు, డ్వామా పీడీ సందీప్, డీఆర్డీఏ పీడీ శోభారాణి, డీఈవో చంద్రకళ, సోషల్ వెల్ఫేర్ డీడీ రామారావు, డీఎంహెచ్వో జగదీశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ జయదేవి, పీసీబీ ఈఈ ముకుందరావు, టూరిజం అధికారి జ్ఞానవేణి, ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్.ఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక శాఖ ప్రాజెక్టులపై సమీక్ష జరిపించాలి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: పర్యాటక శాఖ ప్రాజెక్టులపై సమీక్ష జరిపి, లీజులన్నింటిని రద్దు చేయాలని జనసేన నేత పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ నాయకుల, కాంట్రాక్టర్ల కబ్జాల నుంచి పర్యాటక శాఖ ఆస్తులను పరిరక్షించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిధులు 400 శాతం రెట్టింపు అంచనాలతో కాంట్రాక్టులు ఇచ్చారని, డిప్యూటేషన్‌పై వచ్చి శాఖను నష్టాల బాట పట్టించిన ఆర్డీ పానీగ్రహీ శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ భీమిలి బీచ్ రోడ్‌లో తొట్లకొండ ఎదురుగా ఉన్న బే వాచ్‌లో అక్రమంగా గదులను నిర్మించి నిబంధనలకు విరుద్ధంగా గంటకు ఇంత చొప్పున అద్దెలకు ఇచ్చి వ్యభిచార కేంద్రంగా మార్చేసారని ఆరోపించారు. ఋషికొండ బీచ్‌ను బ్లూ ఫ్లాగ్ పేరిట పర్యాటక శాఖ అధికారులు పూర్తిగా దోచుకుంటూ పర్యాటకుల మీద రుసుముల భారం మోపుతున్నారన్నారు. పర్యాటక శాఖ ప్రాజెక్టుగా పలు రాయితీలతో ప్రారంభమైన సినోరా బీచ్ రిసార్ట్స్‌లో ప్రస్తుతం సన్ ఇంటర్నేషనల్ స్కూల్ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తోందన్నారు. జాలరి పేటను అనుకొని ఉన్న టౌన్ సర్వే నెం 51/3లో గల పర్యాటక శాఖకు చెందిన భూములు కబ్జాకి గురైనా అధికారులు స్పందించడం లేదని విమర్శించారు.

అప్పుఘర్ ఎదురుగా ఉన్న యాత్రి నివాస్ మరమ్మతులకు వైసీపీ ప్రభుత్వం అధికంగా ఎనిమిది కోట్ల రూపాయలు మంజూరు చేసిందని ధ్వజమెత్తారు. పాత రుషికొండ కాటేజీలు, యాత్రి నివాసంలోని గదుల్లో కోట్ల రూపాయలు విలువ చేసే మంచాలు, సోఫాలు, ఏసీలు డైనింగ్ టేబుల్ వంటి విలువైన ఫర్నిచర్ అంతా మాయం చేసారని ఆరోపించారు. వైసీపీ పాలనా కాలంలో విశాఖతో పాటు ఉత్తరాంధ్రా జిల్లాల్లో పర్యాటక ప్రాజెక్టుల విషయంలో తీసుకున్న కీలక నిర్ణయాలు, లీజ్‌లు, కాంట్రాక్టులు వంటి వాటన్నింటిపైనా సమీక్ష జరిపి పర్యాటక శాఖను గతంలో మాదిరిగా లాభాల బాట పట్టించాల్సిన అవసరం వుందని, ఈ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కారానికి యాజమాన్యాలు సత్వర చర్యలు చేపట్టాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విద్యార్థులు పాఠశాలల్లో ఎదుర్కొంటున్న వివిధ సమస్యల సత్వర పరిష్కారానికి రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు వివిధ చర్యలు చేపట్టేందుకు ముందుకు రావాల్సిందేనని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు,సభ్యులు గొండు సీతారాంలు అన్నారు. ఎంవిపి.కాలనీలోని శ్రీ సత్య సాయివిద్యా విహార్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌లు సంయుక్తంగా పాఠశాల సమావేశ మందిరంలో శుక్రవారం బాలల హక్కుల పరిరక్షణలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాత్రపై జరిగిన అవగాహనా కార్యక్రమం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి స్కూల్ ప్రిన్సిపాల్ సి.హెచ్.వరలక్ష్మి అధ్యక్షత వహించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలతో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల ఫిర్యాదుల బాక్స్‌ను విద్యార్థినుల చేతులు మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది బాలల హక్కుల పరిరక్షణలో బాధ్యతతో కూడిన కీలక పాత్రధారులు, సూత్రదారులుగా నిలవాలని పిలుపునిచ్చారు. తమ కమిషన్‌కి అందుతున్న ఫిర్యాదుల్లో ఉపాధ్యాయులు, స్కూల్ వాచ్‌మెన్లు, బస్ డ్రైవర్లు, కండక్టర్లు తదితర సిబ్బందిపై అనేక ఆరోపణలతో లేఖలు అందుతూనే ఉన్నాయని అన్నారు. వీటిని ఆదిలోనే అడ్డుకట్ట వేసేందుకు సిబ్బంది నియామకాలు జరిపేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకుని బాలల హక్కుల పరిరక్షణలో పూర్తి సహాయ సహకారాలు అందజేసే వారినే నియమించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. చిన్న, మధ్యతరగతి, పెద్ద, కార్పొరేట్ స్కూళ్లు అనే తేడాలు లేకుండా అన్ని పాఠశాలల్లో బాలల హక్కుల పరిరక్షణకు డేగ కళ్ళతో పర్యవేక్షణ కోసం ఫిర్యాదులు పెట్టెలు ఏర్పాటు చేసేలా చర్యలు చేప డుతున్నామని అన్నారు. వీటిపై అవగాహనకు ప్రభుత్వ శాఖల సమన్వయం కోసం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లకు వివిధ ఆదేశాలు జారీ చేస్తున్నామని అన్నారు. ఎక్కడ బాలల హక్కులకు విఘాతం కల్గినట్టు తమ కమిషన్ దృష్టికొస్తే వాటిపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు చర్యలకు ఉపక్రమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్ట్ డైరెక్టర్ జయదేవి, సీతమ్మధార మండల విద్యాశాఖాధికారి బాలామణి, అర్బన్ చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీలత, శ్రీ సత్య సాయి విద్యా విహార్ స్కూల్ గవర్నింగ్ బాడీ సభ్యులు పి.ఆర్.ఎస్.ఎన్.నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ వై.వి.రవి కుమార్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రామారావు, సీఆర్ఎంటీలు, వివిధ వార్డుల మహిళా సంరక్షణ, వెల్ఫేర్ కార్యదర్శులు, పి.ఓ.ఎం.ఐ.సి. మమత తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలు చెప్పడంలో జగన్ నేర్పరి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విమర్శ

విశాలాంధ్ర - భీమిలి: అబద్ధాలు చెప్పడంలో, ఫేక్ వార్తలను సృష్టించడంలో పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డిని మించిన వారెవరూ ఉండరని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విమర్శించారు. భీమిలి టీడీపీ కార్యాలయంలో గంటా నూకరాజు మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఒక్క చిన్న గట్టు కూడా కట్టలేదని అన్నారు. చెరువులను కబ్జా చేసిన చరిత్ర జగన్ సర్కార్‌ది అని అన్నారు. చెరువులనే కాదు సముద్రాన్ని కూడా కబ్జా చేసిన అతిరథమహానుభావులని ఎద్దేవా చేశారు. విజయసాయిరెడ్డి కుమార్తె భీమిలి తీరంలో కట్టిన అక్రమ కట్టడం గురించి మాట్లాడాలని జగన్ రెడ్డికి సూచించారు. గత పదిరోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు, వచ్చిన వరదల ప్రళయతాండవానికి విజయవాడ ప్రజలు అల్లాడిపోయారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుభవంతో ఎక్కడా రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపాదికన సహాయక చర్యల్లో మునిగితేలుతూ సేవలు అందిస్తే విమర్శించడానికి మీకు నోరు ఎలా వచ్చిందని అడిగారు. ముప్పైకి పైగా మంత్రులు, ఎమ్మెల్యేలు, 32 మంది ఐఏఎస్‌లు, ఐపిఎస్‌లు, ఆర్మీ దళాలు, 3వేల మంది పారిశుధ్య కార్మికులు, రెండువందలకు పైగా ఫైర్ ఇంజన్లు, వందల కొలదీ ట్రాక్టర్లు, స్వచ్ఛంద సంస్థలు, ఇలా ఎన్నో సంస్థలు అవిశ్రాంతంగా సేవలు అందించే పనిలో ఉంటే ఆదుకోవలసింది పోయి రాజకీయ విమర్శలు చేస్తారా..? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా పనికిమాలిన రాజకీయాలకు స్వస్తి పలకాలని గంటా నూకరాజు హితవు పలికారు.

కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కుపై అనుకూలంగా స్పందించాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ విషయాన్ని కేంద్ర మంత్రులతో చర్చించామని, త్వరలో సానుకూల నిర్ణయం వెలువడుతుందని ఆశిస్తున్నామని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. స్టీల్ ప్లాంట్‌లో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమరస్వామి, కార్యదర్శులను ఢిల్లీలో ఇటీవల కాలంలో కలిసి స్టీల్ ప్లాంట్ ప్రస్తుత పరిస్థితిని వివరించామన్నారు. ప్లాంట్ సహకారం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, ఆర్థిక సహాయం చేయటానికి సిద్ధపడిందన్నారు. సెయిల్లో స్టీల్ ప్లాంట్ కలిపితే ప్లాంట్ అన్ని విధాల మంచిదని వివరించామని, ఈ దిశగా ప్రయత్నాలు చేయాలని కోరామన్నారు. స్టీల్ ప్లాంట్ విపత్కర పరిస్థితులు ఉన్నాయని, దీనిపై కేంద్రం స్పందించాలన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ప్రభుత్వ రంగంతోనే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. స్టీల్ ప్లాంట్ కార్మికుల ప్రధాన సమస్యలు పరిష్కారానికి ఇంటక్ ఎనలేని కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, నాయకులు బి.ఎస్.రాజు, కారు రమణ, కొవిరి అవతారం, జీవీ.సుబ్బయ్య, రమణమూర్తి, కొమ్ము ప్రసాద్, మద్ది అప్పలరాజు, బీబీ.జగదీష్, డి.మోహన్, పోతారెడ్డి, నగేష్, గోపాత్రరాజు, దేముడు, వేణుబాబు, ఎస్ఏ.నాయుడు, రాథోడ్, వేణువర్మ, సింహాచలం, ఈశ్వరరావు, సుబ్బారావు, గోపినారాయణ పాల్గొన్నారు.